

Registered No : APTEL/25/A0818

ఇది కద నిజం

సామాన్యుని సమస్యలపై నిత్యం పోరాడే ఆయుధంగా.. జాతీయ తెలుగు దిన పత్రిక



శుక్రవారం 27-11-2026 | పేజీలు :4 | వెల :2 | సంపుటి :02 | సంచిక :158 | www.edhikadhanijam.com | ఎడిటర్ : బాలరాజు గౌడ్

సౌరవ్ దాస్‌పై లుకౌట్ సర్క్యులర్: కేంద్రం!

సౌరవ్ దాస్‌పై లుకౌట్ నోటీసు

హైకోర్టుకు వివరించిన కేంద్రం

లండన్ ప్రయాణానికి ఎయిర్‌పోర్టులో అడ్డంకి

పాస్‌పోర్ట్ వివరాల్లో వ్యత్యాసాలు

ఏడు రోజుల్లో వివరణకు షోకాజ్

పాస్‌పోర్ట్ జప్తు చేసే అవకాశం

రాజకీయ కక్షతో అడ్డుకున్నారని ఆరోపణ


2 లో

న్యూస్ డెస్క్, 26 నవంబర్ (ఇది కద నిజం): కాక్రోచ్ జనతా పార్టీ నాయకుడు సౌరవ్ దాస్ పాస్‌పోర్ట్ వివరాల్లో తీవ్ర వ్యత్యాసాలు ఉన్నందున, ఆయనపై లుకౌట్ సర్క్యులర్ జారీ చేసినట్లుగా కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఢిల్లీ హైకోర్టుకు తెలియజేసింది. మహారాష్ట్ర పోలీసుల అభ్యర్థన మేరకు.. పాస్‌పోర్ట్ వివరాల్లోని తేడాల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లుగా ధర్మాసనానికి ప్రభుత్వం తరఫు లాయర్ తెలిపారు.

విమానాశ్రయంలో అడ్డగింత.. హైకోర్టులో పిటిషన్

ఆక్స్‌ఫర్డ్ యూనియన్ సహా బ్రిటన్‌లోని పలు ప్రతిష్టాత్మక విద్యాసంస్థల్లో జరిగే చర్చా వేదికల్లో ప్రసంగించేందుకు సౌరవ్ దాస్ నవంబర్ 23 అర్ధరాత్రి లండన్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అయితే, ఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోని ఇమ్మిగ్రేషన్ కౌంటర్ వద్ద అధికారులు ఆయనను అడ్డుకుని విదేశీ ప్రయాణానికి అనుమతి నిరాకరించారు.

రేవంత్ స్లోగన్ బాగుంది అర్వింద్ సెటైర్!

డీలిమిటేషన్ డ్రాఫ్ట్ బిల్లు త్వరలోనే: అర్వింద్

సీఎం రేవంత్ స్లోగన్ బాగుందంటూ వ్యంగ్యం

'కోటి ఓట్లు - 90 సీట్లు' నినాదంపై వ్యాఖ్య

తెలంగాణలో కాంగ్రెస్ పతనం మొదలైందని విమర్శ

వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా

కృష్ణా, గోదావరి జలాల తరలింపుపై కేసీఆర్‌పై ఆరోపణలు

డీలిమిటేషన్ ప్రక్రియ జరిగి తీరుతుందని స్పష్టం

కాంగ్రెస్ భ్రమలు త్వరలో తొలగుతాయని వ్యాఖ్య

2 లో

చాయ్ పీఆర్ స్టంట్..

ఉద్యోగాలు ఎక్కడ?: కేటీఆర్!

నిరుద్యోగంపై రాహుల్ గాంధీకి కేటీఆర్ ప్రశ్నలు

అశోక్ నగర్ చాయ్ ప్రచారంపై విమర్శలు

రెండు లక్షల ఉద్యోగాల హామీ ఏమైందని నిలదీత

యువ వికాసం ఎండమావిగా మారిందని ఆరోపణ

జాబ్ క్యాలెండర్‌పై నిరుద్యోగుల అసంతృప్తి

ఉద్యోగాల కల్పన ఫోటోషూట్ కాదని వ్యాఖ్య

2 లో

రాజ్యాంగ స్ఫూర్తితో వికసిత్ భారత్: మోడీ!


2 లో

న్యూస్ డెస్క్, 26 నవంబర్ (ఇది కద నిజం): భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్యానికి అమూల్యమైన వారసత్వమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గురువారం దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్‌తో పాటు రాజ్యాంగ సభ సభ్యుల సేవలను ఈ సందర్భంగా స్మరించుకున్నారు.



2028 సమరానికి కాంగ్రెస్ సన్నద్ధం!

- మిషన్ 2028కు కాంగ్రెస్ శ్రీకారం!
- రేవంత్ నేతృత్వంలో ఐదుగురి టీమ్
- ఇప్పటి నుంచే ఎన్నికల వ్యూహాలు
- డీలిమిటేషన్‌పై ముందస్తు కసరత్తు
- కొత్త స్థానాల్లో యువ నాయకులకు ఛాన్స్
- సర్వేలతో ఎమ్మెల్యేల పనితీరు అంచనా
- గ్రాఫ్ పడితే నేతలకు క్లాస్!
- కొత్త పథకాలతో ఓటు బ్యాంకుపై గురి
- బీఆర్ఎస్, బీజేపీ స్థానాలపై ఫోకస్!

న్యూస్ డెస్క్, 26 నవంబర్ (ఇది కద నిజం): 'వచ్చే ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ఇప్పటినుంచే ఐదుగురం సీరియస్‌గా పనిచేస్తున్నాం. ఎన్నికల ఆట ఎలా ఆడాలో మాకు తెలుసు. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా మళ్లీ గోల్ కొడుతాం. విపక్షాలను వంగపెడుతాం. అధికారంలోకి వస్తాం' అంటూ ఈ మధ్య మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పిన మాటలు పొలిటికల్ వర్గాల్లో హాట్‌టాపిక్ అయ్యాయి. మంత్రి పొంగులేటి చెప్పిన ఆ ఐదుగురు టీమ్ మెంబర్స్ ఎవరు? ఏం చర్చిస్తున్నారు? ఎలాంటి వ్యూహాలు రచిస్తున్నారు? అని అందరిలో ఆసక్తికర చర్చ మొదలైంది. పార్టీ వర్గాల్లో ఉన్న ప్రచారం మేరకు స్ట్రాటజీ టీమ్‌లో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి ఉన్నట్టు తెలిసింది. వీరంతా తరచుగా సమావేశమై వచ్చే ఎన్నికలను ఎదుర్కొనేందుకు వ్యూహాలు రచిస్తున్నట్టు సమాచారం.

మిగతాది 2 లో..

మన చరిత్ర ఎవరూ రాయరు.. మనమే రాసుకోవాలి

మహిళలకు ఆర్థికంగా అండ

పదవుల్లోనూ ప్రాధాన్యత

మహిళలకు నిజమైన పండుగ

మనుషులుగా గుర్తించింది రాజ్యాంగమే

ఆడవాళ్లను వస్తువులుగా చూశారు

ప్రతి ఇంట్లో రాజ్యాంగం ఉండాలి



న్యూస్ డెస్క్, 25 నవంబర్ (ఇది కద నిజం): త్వరలో బీఆర్ఎస్ కొట్టుకుపోతుందంటూ టీఆర్ఎస్ అధినేత్రి కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ మీడియా ఛానల్‌లో ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు తనపై దాడి చేస్తున్నారని చెప్పారు. తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తున్నారని, అలా చేస్తే ఏం వస్తుందని ప్రశ్నించారు. టీఆర్ఎస్ పార్టీకి ఆదరణ పెరుగుతుందనే భయంతోనే తనను టార్గెట్ చేస్తున్నారని అన్నారు. తనను ఇంటి నుండి వెళ్లగొట్టారని, ఇంకా ఏం సాధిస్తారని ప్రశ్నించారు.

3 లో

సాగర్ నుంచి నీటి విడుదల.. రైతులకు తీపికబురు!


2 లో

సాగర్ కుడి, ఎడమ కాలువల నుంచి నీటి విడుదల

చెరో 15 వేల క్యూసెక్కులు విడుదల

ఏపీ నీటి విడుదలతో తెలంగాణ అప్రమత్తం

పోటాపోటీగా గేట్లు ఎత్తిన అధికారులు

రిజర్వాయర్లు, చెరువులు నింపాలని ఆదేశాలు

రైతులకు సాగునీటితో ఊరట

కృష్ణా జలాల పంపిణీపై మళ్లీ వివాదం

పల్నాడు వాటర్ గ్రిడ్‌తో ముదురుతున్న జల వివాదం

పోక్సో కేసులో మరో కీలక మలుపు.. భగీరథ్‌కు సమన్లు!

పోక్సో కేసులో బండి భగీరథ్‌కు సమన్లు

జనవరి 28న కోర్టుకు హాజరు కావాలి

మేడ్చల్ పోక్సో కోర్టు కీలక ఆదేశాలు

మైనర్ బాలిక ఫిర్యాదుతో కేసు నమోదు

పోక్సో, బీఎన్ఎస్ సెక్షన్లు జోడింపు

55 రోజుల జైలు తర్వాత బెయిల్



న్యూస్ డెస్క్, 26 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన బండి భగీరథ్ పోక్సో కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. బండి సాయి భగీరథ్‌కు మేడ్చల్ పోక్సో ప్రత్యేక న్యాయస్థానం తాజాగా సమన్లు జారీ చేసింది. ఈ కేసు విచారణలో భాగంగా వచ్చే ఏడాది జనవరి 28వ తేదీన కోర్టు ఎదుట తప్పనిసరిగా హాజరుకావాలని న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. 17 ఏళ్ల మైనర్ బాలికకు మద్యం తాగించి, శారీరకంగా ఇబ్బందులకు గురిచేసి వేధించారంటూ బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ప్రస్తుతం బండి భగీరథ్‌కు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో జైలు నుంచి బయటికి వచ్చారు.

2 లో

కేంద్రం కొత్త రూల్స్.. వ్యాపారులకు భారీ ఊరట!



వ్యాపారులకు కేంద్రం కొత్త జీఎస్టీ వెసులుబాటు

డిసెంబర్ 1 నుంచి కొత్త రద్దు నిబంధనలు

బకాయిలు లేకుంటే ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్ రద్దు

జీఎస్టీ పోర్టల్‌లోనే రద్దు ధ్రువీకరణ పత్రం

బకాయిలుంటే అధికారుల పరిశీలన తప్పనిసరి

పన్ను, వడ్డీ, జరిమానాలు చెల్లిస్తే వేగంగా రద్దు

2 లో

డిసెంబర్ 15లోపు పార్లమెంట్ సమావేశాలు?

మంత్రులకు మోడీ కీలక ఆదేశాలు

సమావేశాల తేదీలపై ఉత్కంఠ

డీలిమిటేషన్ బిల్లుపై ప్రత్యేక భేటీ?

రాజ్యాంగ సవరణకు 360 ఓట్లు

ప్రతిపక్ష మద్దతుపై కేంద్రం ఆశలు

ఎన్డీఏకు పెరిగిన రాజకీయ బలం

డీఎంకే, ఎన్సీపీ ఓట్లే కీలకం

ఎస్ఐఆర్‌పై పార్లమెంట్‌లో రగడ?

లోక్‌సభ స్థానాల పెంపు ప్రతిపాదన



న్యూస్ డెస్క్, 26 నవంబర్ (ఇది కద నిజం): పార్లమెంట్ శీతాకాల సమావేశాల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ముమ్మరం చేస్తున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ 15లోపు పార్లమెంట్ తదుపరి సమావేశాల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, అప్పటివరకు విదేశీ పర్యటనలకు దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన మంత్రివర్గ సహచరులకు సూచించినట్లు సమాచారం. కీలక బిల్లులు, రాజకీయ పరిణామాల నేపథ్యంలో మంత్రులందరూ అందుబాటులో ఉండాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ఈ పరిణామాలు సూచిస్తున్నాయి.

బుధవారం ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ఈ అంశం చర్చకు వచ్చినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ 15లోపు పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యేలా సిద్ధంగా ఉండాలని, తమ తమ శాఖలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేయాలని మంత్రులకు సూచించినట్లు సమాచారం. అయితే సమావేశాల ప్రారంభ తేదీ, వ్యవధిపై పార్లమెంటరీ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ తుది నిర్ణయం తీసుకోనుంది.

పార్లమెంట్ శీతాకాల సమావేశాల నిర్వహణలో జాప్యం జరుగుతోందంటూ ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి

2 లో

ఫుడ్ ప్యాకెట్లపై కొత్త నిబంధనలు సుప్రీం కీలక ఆదేశం!

ప్యాకేజ్డ్ ఫుడ్‌పై రెడ్ వార్నింగ్ తప్పనిసరి

కేంద్రం, FSSAIలకు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

అధిక ఉప్పు, చక్కెర, కొవ్వుపై ప్రత్యేక హెచ్చరికలు

ప్యాకెట్ల ముందు భాగంలో షడ్భుజి గుర్తులు

'హై ఫ్యాట్', 'హై షుగర్', 'హై సాల్ట్' లేబుళ్లు

వినియోగదారులకు సులభంగా కనిపించేలా హెచ్చరికలు

నిబంధనల అమలుపై పర్యవేక్షణకు ఆదేశాలు

2 లో

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 27-11-2026

ఫుడ్ ప్యాకెట్లపై కొత్త నిబంధనలు.. సుప్రీం కీలక ఆదేశం!



న్యూస్ డెస్క్, 26 నవంబర్ (ఇది కద నిజం): ప్యాకేజ్డ్ ఆహార ఉత్పత్తులపై పోషక విలువలకు సంబంధించిన హెచ్చరిక లేబుళ్లను సమర్థవంతంగా అమలు చేయాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (FSSAI)ను ఆదేశించింది. జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆహార పదార్థాల ప్యాకెట్ల ముందు భాగంలోనే పోషకాలకు సంబంధించిన హెచ్చరికలు స్పష్టంగా కనిపించేలా విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది.

షడ్భుజి సింబల్‌తో వార్నింగ్ లేబుళ్లు..: కొవ్వు, చక్కెర, ఉప్పు పరిమాణాలు ఎక్కువగా ఉన్న ఆహార ఉత్పత్తులపై విడివిడిగా ఎరుపు షడ్భుజి ఆకారపు హెచ్చరిక లేబుళ్లను ముద్రించాలని ధర్మాసనం నిర్దేశించింది. వీటిని కలిపి కాకుండా, ఏ పోషకం ఎక్కువగా ఉంటే దానికి సంబంధించిన ప్రత్యేక హెచ్చరిక చిహ్నాన్ని ప్యాకెట్ ముందు భాగంలో ప్రదర్శించాలని కోర్టు పేర్కొంది. ఈ విధానం వల్ల వినియోగదారులు ఏ ఒక్క పదార్థంలో ఏ అంశం అధికంగా ఉందన్న విషయాన్ని సులభంగా గ్రహించగలరని ధర్మాసనం భావించింది. తద్వారా ఆహార పదార్థాల ఎంపికలో ప్రజలకు మరింత స్పష్టత లభిస్తుందని తెలిపింది.

చిత్ర రూపం.. స్పష్టమైన పదాలు: ప్రతి హెచ్చరిక చిహ్నంలో సంబంధిత పోషకానికి సంబంధించిన ప్రామాణిక చిత్ర రూపంతో పాటు HIGH FAT, HIGH SUGAR లేదా 'HIGH SALT' అనే పదాలు స్పష్టంగా ఉండాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. చదవడానికి కష్టంగా ఉండే చిన్న అక్షరాల కంటే, సులభంగా గుర్తించగలిగే చిత్రాలు, స్పష్టమైన పదాలు వినియోగదారులకు త్వరగా అర్థమవుతాయని కోర్టు అభిప్రాయపడింది. ప్యాకెట్ వెనుక భాగంలో ఉండే పోషక వివరాల పట్టికను చాలామంది వినియోగదారులు పూర్తిగా చదవరని, అందువల్ల ముందు భాగంలోనే ఈ హెచ్చరిక చిహ్నాలు ఉండటం అత్యవసరమని ఈ ఆదేశాలు సూచిస్తున్నాయి. ఇక అధిక కొవ్వు, అధిక చక్కెర, అధిక ఉప్పు కలిగిన ఆహారాలను తరచుగా తీసుకోవడం వల్ల ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. ముందు భాగంలో హెచ్చరిక లేబుళ్లు ఉండటం వల్ల సాధారణ ప్రజలతో పాటు పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక సమస్యలు ఉన్నవారికి తగిన ఆహారాన్ని ఎంచుకోవడం సులభమవుతుంది. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు కొనిపెట్టే స్నాక్స్, పానీయాలు, ఇతర ప్యాకేజ్డ్ ఉత్పత్తుల విషయంలో మరింత జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకునేందుకు ఈ లేబుళ్లు తోడ్పడతాయి.

అమలు, నియంత్రణపై దృష్టి: ఫ్రంట్-ఆఫ్-ప్యాక్ న్యూట్రిషన్ లేబులింగ్ నిబంధనలను కేవలం కాగితాలకే పరిమితం చేయకుండా, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రం, FSSAI పై ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. తయారీ సంస్థలు ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా పర్యవేక్షణ ఉండాలని కోర్టు సూచించింది.

కాంగ్రెస్ పతనం మొదలైంది: ఎంపీ అర్వింద్!




న్యూస్ డెస్క్, 26 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియ జరిగి తీరుతుందని, ఇందుకు సంబంధించిన డ్రాఫ్ట్ బిల్లు త్వరలోనే రాబోతోందని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ స్పష్టం చేశారు. రాష్ట్ర రాజకీయాలు, సాగునీటి ప్రాజెక్టులు, రాబోయే ఎన్నికలపై ఆయన కీలక వ్యాఖ్యలు చేస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ తామే అధికారంలోకి వస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా బాగుందనీ, 'కోటి ఓట్లు - 90 సీట్లు' అంటూ కాంగ్రెస్ ఇస్తున్న స్లోగన్ కూడా వినడానికి బాగుందని అర్వింద్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అయితే, అదంతా కేవలం భ్రమ మాత్రమేనని, కొద్ది రోజుల్లోనే కాంగ్రెస్ నేతలకు అసలు వాస్తవం తెలిసి వస్తుందని ఆయన అన్నారు.

కాంగ్రెస్ పతనం మొదలైంది..

రాష్ట్రంలో ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ పతనం మొదలైందని ఎంపీ అర్వింద్ అభిప్రాయపడ్డారు. రాబోయే ఎన్నికల నాటికి తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా భూస్థాపితం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధికారంలోకి రావడం తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా అర్వింద్ విమర్శలు చేశారు. తెలంగాణకు రావాల్సిన కృష్ణా, గోదావరి జలాల తరలింపు పాపం ముమ్మాటికీ మాజీ ముఖ్యమంత్రి కేసీఆరేనని ఆయన ఆరోపించారు.

సాగర్ నుంచి నీటి విడుదల.. రైతులకు తీపికబురు!

న్యూస్ డెస్క్, 26 నవంబర్ (ఇది కద నిజం): కృష్ణా జలాల పంపిణీ విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదం మరోసారి రగులుకుంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు వద్ద ఇరు రాష్ట్రాల అధికారులు పోటాపోటీగా నీటిని విడుదల చేయడంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అయితే, ఇరు కాలువల ద్వారా భారీగా నీరు విడుదల కావడం ఆయకట్టు రైతులకు మాత్రం తీపికబురుగా మారింది.

పోటాపోటీగా నీటి విడుదల..: ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ముందుగా ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ అధికారులు నాగార్జునసాగర్ కుడి కాలువ గేట్లు ఎత్తి 15 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఏపీ చర్యలను గమనించిన తెలంగాణ అధికారులు వెంటనే అప్రమత్తమై, పోటీగా ఎడమ కాలువ గేట్లను ఎత్తి అంతే మొత్తంలో నీటిని దిగువకు వదిలారు. ఇక ఎడమ కాలువకు తాగునీటి అవసరాల నిమిత్తం నీటిని విడుదల చేసిన తెలంగాణ అధికారులు, నీటి వృథా కాకుండా కీలక ఆదేశాలు జారీ చేశారు. విడుదలైన ఈ జలాలతో నల్గొండ జిల్లా త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి రిజర్వాయర్‌తో పాటు ఖమ్మం జిల్లాలోని పాలేరు రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపాలని సూచించారు. అంతేకాకుండా, త్రిపురారం మండల పరిధిలోని అన్ని చెరువులు, కుంటలను కూడా ఈ నీటితో నింపాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.

ముదురుతున్న జల వివాదం: ఇటీవల జరిగిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు త్రిసభ్య కమిటీ సమావేశంలో సాగర్ జలాల పంపిణీపై ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరలేదు. దీనికి తోడు, సాగర్ నుంచి నీటిని తరలించేందుకు ఏపీ నిర్మిస్తున్న 'పల్నాడు వాటర్ గ్రిడ్' ప్రాజెక్టు విషయంలో ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య వివాదం తీవ్రమైంది. ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల అధికారులు పోటాపోటీగా చెరో 15 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం ప్రాజెక్టు వద్ద చర్చనీయాంశంగా మారింది.

పోక్సో కేసులో మరో కీలక మలుపు.. భగీరథ్‌కు సమన్లు!

మొదటి పేజీ తరువాయి

ఈ ఏడాది మే 8వ తేదీన హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై ఎఫ్ఐఆర్ నమోదైంది. వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేశారని.. ఆ తర్వాత తమపైనే తప్పుడు ఫిర్యాదులు చేయించి బెదిరింపులకు పాల్పడ్డారని బాధితురాలి తరపు వారు ఆరోపించారు. దర్యాప్తులో భాగంగా కేసుకు సంబంధించిన ఆధారాలను మాయం చేసే ప్రయత్నం జరిగిందని గుర్తించిన పోలీసులు, పోక్సో చట్టంతో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) కింద మరిన్ని కఠిన సెక్షన్లను జోడించారు.

ఈ కేసు నమోదైన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. కొన్ని రోజుల పాటు పోలీసుల కళ్లుగప్పి తిరిగిన బండి భగీరథ్ .. చివరకు మే 16న పోలీసుల ఎదుట లొంగిపోయారు. అయితే పరారీలో ఉన్న బండి భగీరథ్‌ను తామే పట్టుకున్నామని, అతడు లొంగిపోలేదని పోలీసులు పేర్కొన్నారు. అనంతరం మేడ్చల్ మేజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో చర్లపల్లి జైలుకు తరలించారు. విచారణ సమయంలో పోలీసులు మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించారు. మధ్యలో బీబీఏ పరీక్షలు రాసేందుకు మల్కాజ్‌గిరి కోర్టు వారం రోజుల పాటు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

దాదాపు 55 రోజుల పాటు జైలులో ఉన్న గడిపిన తర్వాత.. బండి భగీరథ్‌కు జులై నెలలో తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. దర్యాప్తు దాదాపు పూర్తి కావడం, 25 మంది సాక్షుల వాంగ్మూలాలను పోలీసులు ఇప్పటికే నమోదు చేయడాన్ని పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ కె. సుజన ధర్మాసనం కఠిన షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ. లక్ష వ్యక్తిగత బాండ్‌తో పాటు పాస్‌పోర్ట్ సరెండర్ చేయాలని, బాధితురాలిని గానీ, సాక్షులను గానీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంప్రదించకూడదని ఆదేశించింది. అంతేకాకుండా ఈ కేసు గురించి మీడియా, సోషల్ మీడియాలో ఎక్కడా మాట్లాడకూడదని స్పష్టం చేసింది.

మరోవైపు.. తనపై తప్పుడు ఆరోపణలు చేసి రూ. 5 కోట్లు డిమాండ్ చేశారంటూ బండి భగీరథ్ ఇచ్చిన కౌంటర్ ఫిర్యాదుపైనా పోలీసుల విచారణ కొనసాగుతోంది. ఇటీవలే తమ ప్రతిష్టకు భంగం కలిగించేలా కథనాలు ప్రసారం చేయకుండా మీడియాను నియంత్రించాలని కోరుతూ బండి భగీరథ్ హైకోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు కూడా ఇచ్చింది. ఈ నేపథ్యంలో తాజాగా మేడ్చల్ పోక్సో కోర్టు జనవరి 28వ తేదీన హాజరుకావాలని సమన్లు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది.

కేంద్రం కొత్త రూల్స్.. వ్యాపారులకు భారీ ఊరట!

న్యూస్ డెస్క్, 26 నవంబర్ (ఇది కద నిజం): వ్యాపారవేత్తలు తమ జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకోవాలనుకునే ప్రక్రియలో కేంద్ర ప్రభుత్వం కీలక మార్పులు తీసుకువచ్చింది. పన్ను చెల్లింపుదారులకు ఇబ్బందులు లేకుండా, పారదర్శకంగా ఈ ప్రక్రియ జరిగేలా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కొత్త నిబంధనలను రూపొందించింది. తాజాగా విడుదలైన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం.. కొత్త రూల్స్ డిసెంబర్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

బకాయిలు లేకపోతే వెంటనే ఆన్‌లైన్‌లో రద్దు

సాధారణంగా వ్యాపారం మూసివేసినప్పుడు, ఇతర కారణాల వల్ల జీఎస్టీ రిజిస్ట్రేషన్ రద్దు కోసం దరఖాస్తు చేసుకుంటారు. కొత్త నిబంధనల ప్రకారం.. దరఖాస్తుదారుడు నిర్దేశిత గడువులోగా తన వ్యాపార వివరాలను సమర్పించి, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్ను, వడ్డీ, జరిమానా, ఇతర ఫీజులన్నీ పూర్తిగా చెల్లించినట్లయితే ఎలాంటి జాప్యం ఉండదు. వారు ఏ తేదీ నుంచి రద్దు కోరుకున్నారో, ఆ తేదీ నుంచే జీఎస్టీ పోర్టల్ ద్వారా ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్ రద్దు అవుతుంది. అందుకు సంబంధించిన నిర్ధారణ పత్రం ఆన్‌లైన్‌లోనే అందుబాటు ఉండనుంది.

బకాయిలు ఉంటే అధికారి పరిశీలన మస్ట్

ఒకవేళ దరఖాస్తు చేసుకున్న వ్యక్తి అవసరమైన రిటర్న్స్, ఫారం జీఎస్టీ సీఎంపీ-08 వివరాలను సమర్పించకపోయినా, ఇంకా పన్ను.. జరిమానా బకాయిలు బాకీ ఉన్నా రిజిస్ట్రేషన్ వెంటనే రద్దు కాదు. అలాంటి దరఖాస్తులను తదుపరి విచారణ కోసం సంబంధిత జీఎస్టీ అధికారికి పంపుతారు. అధికారి పరిశీలన తర్వాతే వాటిపై నిర్ణయం తీసుకుంటారు. కాగా, జీఎస్టీ కౌన్సిల్ సిఫార్సుల మేరకు కేంద్ర ప్రభుత్వం 2017 నాటి సీజీఎస్టీ నియమాల్లోని రూల్-20కి ఈ సవరణలు చేసింది. దీంతో నిబంధనల ప్రకారం అన్ని బకాయిలు చెల్లించిన వ్యాపారులకు అధికారుల చుట్టూ తిరిగే పని లేకుండా వేగంగా రిజిస్ట్రేషన్ రద్దు అయ్యే వెసులుబాటు కలగనుంది.

చాయ్ పీఆర్ స్టంట్.. ఉద్యోగాలు ఎక్కడ?: కేటీఆర్!



న్యూస్ డెస్క్, 26 నవంబర్ (ఇది కద నిజం): తెలంగాణలో నిరుద్యోగ సమస్య, ఉద్యోగాల కల్పన అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌లో రాహుల్ గాంధీ చేసిన పర్యటనను ప్రస్తావిస్తూ, ఆనాటి హామీలు ఇప్పుడు ఏమయ్యాయని ఆయన నిలదీశారు. ఈ మేరకు కేటీఆర్ సోషల్ మీడియా వేదికగా గురువారం ఘాటైన పోస్ట్ చేశారు.

మూడేళ్ల క్రితం అశోక్ నగర్‌లో నాటకీయ లైటింగ్ మధ్య ఇరానీ చాయ్ తాగుతూ, ఫోటోలకు పోజులిస్తూ ఆకాశమే హద్దుగా హామీలు గుప్పించారని కేటీఆర్ విమర్శించారు. కానీ మూడేళ్ల తర్వాత అసలు నిజం బయటపడిందని పేర్కొన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు ఒక కల్పిత కథగా మిగిలిపోయాయని, యువ వికాసం ఒక ఎండమావిలా మారిందని, జాబ్ క్యాలెండర్ తెలంగాణ నిరుద్యోగుల నమ్మకాన్ని అపహాస్యం చేసేలా ఉందని కేటీఆర్ దుయ్యబట్టారు. ఉద్యోగాల కల్పన అనేది ఫోటోషూట్ కాదని, చాయ్ తాగే పీఆర్ స్టంట్ అంతకన్నా కాదని స్పష్టం చేశారు. ఒక్క ఉద్యోగం ఇవ్వాలన్నా దార్శనికత, అంకితభావం అవసరమని హితవు పలికారు. తెలంగాణ యువత కోసం ఏమీ చేయలేమని రాహుల్ గాంధీ, ఆయన బృందం పదేపదే నిరూపించుకున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ప్రత్యేక తెలంగాణ కోసం పోరాడిన యువత మళ్లీ పోరాడేందుకు సిద్ధంగా ఉన్నారని కేటీఆర్ హెచ్చరించారు. కాంగ్రెస్ పాలన నుంచి తెలంగాణకు తిరిగి విముక్తి కల్పించేందుకు యువత పోరాడుతుందని అన్నారు. ఇది కేసీఆర్ గడ్డ అని, పోరాటయోధుల నేల అని, మోసాన్ని పోరాటయోధులు ఎన్నటికీ మర్చిపోరని కేటీఆర్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

సౌరవ్ దాస్‌పై లుకౌట్ సర్క్యులర్: కేంద్రం!

మొదటి పేజీ తరువాయి

తనను అడ్డుకునే సమయంలో ఎలాంటి అధికారిక ఉత్తర్వులు గానీ, లుకౌట్ నోటీసులు గానీ చూపించలేదని ఆరోపిస్తూ సౌరవ్ దాస్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కోర్టుకు వివరాలను వెల్లడించింది.

పాస్‌పోర్టులో భారీ వ్యత్యాసాలు..

అయితే, సౌరవ్ దాస్ సమర్పించిన గుర్తింపు పత్రాల మధ్య భారీ తేడాలు ఉన్నాయని అధికారులు గుర్తించారు. ముఖ్యంగా ఆయన పుట్టిన ప్రదేశం, పుట్టిన తేదీ, తండ్రి పేరు వంటి వివరాలకు సంబంధించి ఆధార్ కార్డు, స్కూల్ సర్టిఫికెట్, పాస్‌పోర్ట్‌లలో పొంతన లేదని పేర్కొన్నారు. ఢిల్లీ, పుదుచ్చేరి చిరునామాలతో జారీ అయిన ఈ పత్రాల్లోని వ్యత్యాసాలపై ఇటీవల దర్యాప్తు సంస్థల నుంచి సమాచారం అందినట్లుగా విదేశాంగ శాఖ తెలిపింది. అయితే, వాస్తవాలను దాచిపెట్టి 2019 ఆగస్టు 21న పాస్‌పోర్ట్ పొందారనే ఆరోపణలపై చెన్నై ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం నవంబర్ 23న సౌరవ్ దాస్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. 7 రోజుల్లోగా సరైన ఆధారాలతో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అప్పటి వరకు పాస్‌పోర్ట్‌ను విదేశీ ప్రయాణాలకు ఉపయోగించవద్దని స్పష్టం చేస్తూ, సంతృప్తికరమైన సమాధానం ఇవ్వకపోతే పాస్‌పోర్ట్ చట్టం-1967 ప్రకారం సౌరవ్ దాస్ పాస్‌పోర్ట్‌ను జప్తు చేస్తామని హెచ్చరించింది. మరోవైపు, తన విమాన ప్రయాణానికి కేవలం కొన్ని గంటల ముందు ఈమెయిల్ ద్వారా షోకాజ్ నోటీసు పంపారని, ఎయిర్‌పోర్టులో అడ్డుకునే వరకు తనకు ఆ విషయం తెలియదని సౌరవ్ దాస్ పేర్కొన్నారు. 2019లో పోలీస్ వెరిఫికేషన్ తర్వాతే పాస్‌పోర్ట్ జారీ అయిందని, అప్పటి నుంచి తాను పలుమార్లు విదేశాలకు వెళ్లి వచ్చానని గుర్తుచేశారు. రాజకీయ కక్షతోనే తన ప్రయాణాన్ని అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు.

రాజ్యాంగ స్ఫూర్తితో వికసిత్ భారత్: మోడీ!

మొదటి పేజీ తరువాయి

సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో ప్రధాని మోడీ ఒక సందేశాన్ని పోస్టు చేశారు. రాజ్యాంగం భారత ప్రజాస్వామ్యానికి లభించిన అమూల్యమైన సంపద అని, అభివృద్ధి చెందిన భారతదేశం (వికసిత్ భారత్) నిర్మించాలనే లక్ష్య సాధనలో ఇది నిరంతరం మార్గనిర్దేశం చేస్తుందని పేర్కొన్నారు. ఈ పవిత్రమైన రోజున బాబాసాహెబ్ అంబేద్కర్‌తో పాటు రాజ్యాంగ సభలోని గొప్ప వ్యక్తులందరికీ గౌరవపూర్వక నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు.

రాజ్యాంగ నిర్మాతలకు ఘన నివాళి

రాజ్యాంగ దినోత్సవం రాజ్యాంగ నిర్మాతలను స్మరించుకోవడంతో పాటు, రాజ్యాంగంలోని విలువలను కాపాడేందుకు మన నిబద్ధతను మరోసారి చాటుకునే సందర్భమని ప్రధాని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడంలో రాజ్యాంగ స్ఫూర్తి ఎంతో కీలకమని పేర్కొన్నారు.

నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవం

భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ 1949 నవంబర్ 26న ఆమోదించింది. అయితే, 1950 జనవరి 26 నుంచి రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. రాజ్యాంగ రూపకల్పనకు రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజుల సమయం పట్టింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 125వ జయంతి సంవత్సరాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం 2015 నవంబర్ 26న తొలిసారిగా రాజ్యాంగ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించింది.

రాజ్యాంగ దినోత్సవం ప్రాముఖ్యత

దేశ పౌరుల్లో రాజ్యాంగ విలువలు, ప్రాథమిక హక్కులు, విధుల పట్ల అవగాహన పెంపొందించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశం. భారత రాజ్యాంగ రూపకల్పనలో విశేష కృషి చేసిన మహనీయులను, ముఖ్యంగా రాజ్యాంగ ముసాయిదా కమిటీ ఛైర్మన్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను స్మరించుకోవడం ఈ రోజు ప్రత్యేకత. రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవడంతో పాటు, పౌరులుగా మన బాధ్యతలను నిర్వర్తించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి.

డిసెంబర్ 15లోపు పార్లమెంట్ సమావేశాలు?

మొదటి పేజీ తరువాయి



ఆగస్టు 13న ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడినప్పటికీ, బుధవారం రాత్రి నాటికి వర్షాకాల సమావేశాలకు అధికారికంగా ముగింపు పలకలేదు. అప్పటికి 103 రోజులు గడిచింది. పార్లమెంట్ సమావేశాలను అధికారికంగా ముగించే ప్రక్రియను 'ప్రొరోగేషన్' అంటారు. సభలు నిరవధికంగా వాయిదా పడిన తర్వాత కూడా ఈ ప్రక్రియ పూర్తికాకపోవడంపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.

ఇదిలా ఉండగా, లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదన నేపథ్యంలో ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లును ప్రభుత్వం ప్రవేశపెడుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేసుకోవడం అంత సులభం కాకపోవచ్చు. ఈ బిల్లు ఆమోదం పొందాలంటే లోక్‌సభలో ఓటింగ్‌లో పాల్గొని ఓటు వేసిన సభ్యుల్లో మూడింట రెండొంతుల మద్దతు అవసరం.

ప్రస్తుత లోక్‌సభలో మొత్తం 543 స్థానాలకు గాను మూడు ఖాళీలు ఉండటంతో 540 మంది సభ్యులు ఉన్నారు. ఈ సంఖ్య ఆధారంగా మూడింట రెండొంతుల మద్దతు లెక్కిస్తే 360 మంది సభ్యుల ఓట్లు అవసరమవుతాయి. అయితే బిల్లుకు మద్దతు అవసరమైన సంఖ్యను లెక్కించే విధానం సభలో హాజరై ఓటు వేసే సభ్యుల సంఖ్యపై ఆధారపడి ఉంటుంది.

ప్రస్తుతం అధికార ఎన్డీఏ కూటమికి 320 మంది ఎంపీల మద్దతు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో బిల్లును ఆమోదింపజేసుకోవాలంటే ప్రతిపక్ష పార్టీల నుంచి అదనపు మద్దతు అవసరం. ఏప్రిల్‌లో లోక్‌సభలో ఈ బిల్లు ఓడిపోయిన తర్వాత రాజకీయ సమీకరణాల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రతిపక్ష శిబిరం నుంచి 26 మంది ఎంపీలు బయటకు వచ్చారు. వారిలో 20 మంది తృణమూల్ కాంగ్రెస్ తిరుగుబాటు ఎంపీలు విడిపోయి నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా లో విలీనమై ఎన్డీఏకు మద్దతు ప్రకటించినట్లు పేర్కొంది. మరో ఆరుగురు శివసేన (యూబీటీ) ఎంపీలు ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరినట్లు తెలిపింది.

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కూడా ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ అంశాలను పార్లమెంట్ సమావేశాల్లో లేవనెత్తే అవకాశం ఉండటంతో శీతాకాల సమావేశాలు వాడివేడిగా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. సభలో ప్రశాంత వాతావరణం లేకుండా రాజ్యాంగ సవరణ బిల్లుపై చర్చ, ఓటింగ్ నిర్వహించడం సాధ్యం కాదని అధికార కూటమికి చెందిన ఓ ఎంపీ అభిప్రాయపడినట్లు సమాచారం. పార్లమెంట్ సమావేశాల నిర్వహణకు సంబంధించి కొన్ని నిబంధనలు కూడా ఉన్నాయి. ఇప్పటికే జరుగుతున్న సమావేశాలను పొడిగించాలంటే కనీసం రెండు రోజుల ముందుగా నోటీసు ఇవ్వాలి. కొత్త సమావేశాలను ఏర్పాటు చేయాలంటే కనీసం 14 రోజుల ముందుగా నోటీసు అవసరం.

అదే సమయంలో 1971 జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాల మధ్య ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల వాటాను కొనసాగించే ప్రతిపాదన కూడా ఉన్నట్లు సమాచారం. అయితే ఈ ఫార్ములాపై ఇప్పటివరకు ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు. ఈ రాజకీయ పరిణామాలన్నింటికీ కేంద్రంగా ఉన్నది రాజ్యాంగం (131వ సవరణ) బిల్లు, 2026. ఏప్రిల్ 17న పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో ప్రవేశపెట్టిన ఈ బిల్లు అవసరమైన మద్దతు సాధించలేకపోయింది. ఇప్పుడు శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును మళ్లీ ప్రవేశపెడతారా? మహిళా రిజర్వేషన్ల అమలుతో పాటు నియోజకవర్గాల పునర్విభజనపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? ప్రతిపక్షాల మద్దతు లభిస్తుందా? అనే అంశాలు కీలకంగా మారాయి.

2028 సమరానికి కాంగ్రెస్ సన్నద్ధం!

మొదటి పేజీ తరువాయి

ఐదుగురితో కోర్ టీమ్.. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండేండ్ల సమయం ఉంది. ఒక వేళ డీలిమిటేషన్ జరిగితే మరో 6 నెలల సమయం కలిసి రానుంది. కానీ కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచే వచ్చే ఎన్నికలను ఏ విధంగా ఎదుర్కోవాలో స్ట్రాటజీలు రచిస్తున్నది. అందుకు సీఎం రేవంత్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల బృందం సీరియస్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే కొత్తగా ఏర్పడే స్థానాల నుంచి ఎవరిని బరిలోకి దింపాలి? పాత వారిని ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేయించాలి? అనే అంశాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఒక వేళ నియోజకవర్గాల సంఖ్య పెరిగితే కొత్త తరానికి టికెట్లు ఇవ్వాలని స్ట్రాటజీ బృందం భావిస్తున్నది. అందుకోసం ఇప్పటినుంచే యంగ్ లీడర్లను గుర్తించే పనిలో నిమగ్నమైనట్లు తెలిసింది. ఇప్పటికే కొన్ని చోట్ల కొత్త నాయకులను గుర్తించి వారితో తరుచుగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు టాక్. మరోవైపు రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటిని ఏ విధంగా ఎదుర్కోవాలో కోర్ టీమ్ దృష్టి సారించినట్లు సమాచారం. ఈ టీమ్ కేవలం విపక్షాల కదలికలపైనే కాకుండా సొంత పార్టీ నేతల కదలికలను సైతం నిశితంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.

పనితీరు సరిగాలేని ఎమ్మెల్యేలకు వార్నింగ్

ప్రతినెలా పార్టీ గ్రాఫ్‌ను తెలుసుకునేందుకు పలు సంస్థలు ఇచ్చే సర్వే నివేదికల ఆధారంగా కోర్ టీమ్ ఓ అంచనాకు వస్తున్నట్లు తెలిసింది. ఎక్కడైతే ఎమ్మెల్యేల గ్రాఫ్ పడుపోతున్నట్లు సంకేతాలు వస్తే.. వెంటనే వారిని పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చే ప్రయత్నాల

Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 27-11-2026

మన చరిత్ర ఎవరూ రాయరు.. మనమే రాసుకోవాలి

పంచాయతీ టు పార్లమెంట్ మహిళలు జెండా ఎగరేసే వరకు ఆర్థికంగా.. హార్థికంగా అండగా ఉంటా

పనిలోనే కాదు పదువుల్లోనూ ప్రాధాన్యత దక్కాలి

రాజ్యాంగం ఆమోదించుకున్న ఈ రోజే ఆడవాళ్లకు నిజమైన పండుగ

మనల్ని మనుషులుగా గుర్తించింది రాజ్యాంగం మాత్రమే

వేల ఏళ్ల పాటు ఆడవాళ్లను ఒక వస్తువుగానో, ఆస్తి గానో మాత్రమే చూశారు

ప్రతి ఇంట్లో మత గ్రంథంతో పాటు రాజ్యాంగం కూడా తప్పకుండా ఉండాలి

తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



ఇది కద నిజం ,హైదరాబాద్ : మహిళలను మనుషులుగా గుర్తించింది భారత రాజ్యాంగం మాత్రమేనని..ఆ రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న నవంబర్ 26 వ తేదీయే మనకు అసలు సిసలైన పండుగ రోజని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత చెప్పారు. ఈ రోజును మహిళలంతా ఘనంగా సెలబ్రేట్ చేసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. గురువారం "సంవిధాన్ దినోత్సవం" సందర్భంగా టీఆర్ఎస్ ఆధ్వర్యంలో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "మహిళలు-రాజ్యాంగం" అనే సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ మహిళలకు రాజ్యాంగం మాత్రమే అన్ని హక్కులు కల్పించిందన్నారు. ప్రతి ఒక్క మహిళ తన ఇంట్లో మత గ్రంథంతో పాటు రాజ్యాంగాన్ని కూడా ఉండేలా చూసుకోవాలని కోరారు. వేల ఏళ్లుగా మహిళలను ఒక వస్తువుగానో, ఆస్తిగానో చూశారని..కానీ రాజ్యాంగం వచ్చిన తర్వాతే మహిళలను మనుషులుగా గుర్తించారని చెప్పారు. పెళ్లికి ముందు వరకు కూడా మహిళను తండ్రి లేదా అన్న ఆస్తిగా, పెళ్లి తర్వాత భర్త, వారి కుటుంబ సభ్యుల ఆస్తిగా చూసేవారన్నారు.



మహాభారతం లో ధర్మరాజు ద్రౌపదిని జూదంలో పణంగా పెట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు కూడా మహిళలకు ఆమె ఇష్టంతో సంబంధం లేకుండానే మగవాళ్లు వారిపై ఆధిపత్యం చెలాయిస్తున్నారన్నారు. రాజ్యాంగం ఆమోదించుకున్న నాటి నుంచే ఈ పరిస్థితి మారిందని గుర్తుచేశారు. ఆడ, మగ అనే సంబంధం లేకుండా ఆడవాళ్లు కూడా మనుషులేనని వారికి కూడా మగవారితో సమానంగా ఓటు హక్కును కల్పించింది కూడా రాజ్యాంగమేనని చెప్పారు. రాజ్యాంగం మహిళలకే ఎక్కువ హక్కులు కల్పించిందని చెప్పారు. రాజ్యాంగం ఆమోదించుకున్న రోజు నుంచే మహిళలకు నిజమైన స్వాతంత్రం వచ్చిందన్నారు.

రాజ్యాంగం అమలు చేస్తే చాలు

రాజ్యాంగం మహిళలకు అన్ని హక్కులు ఇచ్చినప్పటికీ దురదృష్టవశాత్తు ఆ హక్కులను వినియోగించుకునే పరిస్థితి లేకుండా చేస్తున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ కూడా మహిళలు ఉద్యోగం చేస్తే ఆమె సంపాదన భర్తకో, తండ్రికో ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇళ్లు, స్థలం ఉన్న మహిళల సంఖ్య వేళ్లపై లెక్కపెట్టేంత మాత్రమే ఉంటుందని చెప్పారు. సినిమాల్లో గానీ, కూలీ పని లో గానీ, ఐటీ ఉద్యోగాల్లో గానీ ఎక్కడైనా సరే మగవాళ్లతో సమానంగా ఆడవాళ్లు పనిచేసినప్పటికీ వాళ్లకు మగవాళ్లతో సమాన వేతనం ఇవ్వటం లేదని విచారం వ్యక్తం చేశారు. ఏ కులంలో, ఏ మతంలో పుట్టిన సరే ఆడవాళ్లపై వివక్ష ఉంటుందన్నారు. దళిత, బీసీ మహిళలకు ఒక విధమైన వివక్ష ఉంటే, అగ్రకులాల్లో పుట్టిన మహిళలపై ఒక విధమైన వివక్ష ఉంటుందన్నారు. ఇప్పటికీ కూడా ఆడవాళ్లకు వాళ్ల పిల్లల పేరు పెట్టే విషయంలో కూడా స్వేచ్ఛ లేదన్నారు. కమ్యూనిస్ట్ పార్టీలు కొంత మహిళ హక్కుల గురించి పోరాటం చేస్తాయని భావిస్తామని..కానీ ఆ పార్టీలో కూడా మహిళలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. మహిళ నక్సల్స్ ను కూడా చాలా ఇబ్బందులు పెట్టారన్నారు. తాము జనాభాలో సగం ఉన్నామని అందుకు తగిన విధంగా అవకాశాలు ఇవ్వాలని మాత్రమే కోరుతున్నామని చెప్పారు. మగవాళ్ల కన్నా గొప్పవాళ్లమని చెప్పటం లేదని..వాళ్లపై స్వారీ చేస్తామని కూడా మేము అడగటం లేదన్నారు. మగవాళ్లతో సమానంగా తమను చూడాలని మాత్రమే కోరుతున్నామన్నారు. అవన్నీ జరగాలంటే మన రాజ్యాంగాన్ని యధాతథంగా అమలు చేస్తే చాలన్నారు.

మన చరిత్ర మనమే రాసుకోవాలి

ఆడవాళ్లపై ఆధిపత్యం చెలాయించేందుకు మనల్ని తక్కువ చేసి చూపారని కవిత అన్నారు. ఆధిపత్యం చెలాయించే వాళ్లు ముందు మనసు పై కొడతారన్నారు. మనకు తెలివి లేదని పదే పదే అంటూ ఆత్మన్యూనతకు గురిచేస్తారన్నారు. ఆధిపత్యం చెలాయించేందుకు ఆడవారి నోట్లో మాట ఆగదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ఆడవాళ్లపై మగవాళ్లు వ్యతిరేక ప్రచారం చేశారని వాటిని పట్టించుకోవద్దన్నారు. సాయుధ రైతాంగ పోరాటం సహా ఎన్నో పోరాటాల్లో పురుషులతో సమానంగా మహిళలు కూడా ఫైట్ చేశారని కానీ మహిళల పోరాటాన్ని ఎక్కడ రాయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతాంగ పోరాటంపై 21 పుస్తకాలు వస్తే అందులో 20 మగవాళ్లే రాశారని..ఎక్కడ కూడా పోరాటంలో ఆడవాళ్ల పాత్ర గురించి రాయలేదన్నారు. ఒక్కరే మహిళ రాసిన పుస్తకం ద్వారా చాకలి ఐలమ్మ పోరాటం మనకు తెలిసిందని చెప్పారు. మన చరిత్ర మనమే చెప్పుకోవాలని..లేదంటే చరిత్ర ఉండదని చరిత్ర మనకు చెబుతుందన్నారు. మనం ఆడసింహాలం మన చరిత్రను మనమే రాసుకోవాల్సిన అవసరముందన్నారు.

నాడు సాయిత్రి భాయ్ పై మురికి నీళ్లు... నేడు మన మీద మురికి కామెంట్లు

సమాజం కోసం పనిచేసేందుకు ముందు వచ్చే మహిళలను ఇప్పటికీ అవమానిస్తున్నారని కవిత విచారం వ్యక్తం చేశారు. ఆనాడు మహిళలకు విద్య చెప్పేందుకు కృషి చేసిన సాయిత్రి భాయ్ పూలే పై పెండ, మురికి నీళ్లు చల్లారని..నేడు రాజకీయాల చేసే మహిళలపై మురికి కామెంట్లతో దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటికి ఇప్పటికీ ఏ మార్పు లేదన్నారు. సాయిత్రి భాయ్ పూలే చదువు చెప్పేందుకు ఇల్లు ఇచ్చిన ఫాతిమా షేక్ అనే మహిళను కూడా అవమానించారని గుర్తు చేశారు. కానీ మహిళలు వీటిని పట్టించుకోని భయపడవద్దన్నారు. ఏనుగు రోడ్డుపై పోతుంటే కుక్కలు మొరుగుతూనే ఉంటాయని వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. హనుమంతుడి తన బలం ఎలా తెలియదో..మహిళలకు కూడా వారి బలం తెలియటం లేదన్నారు. మనం ఎవరికీ తీసిపోమని గుర్తించాలన్నారు. ఇప్పటికీ కూడా ప్రతి 8 నిమిషాలకు ఒక మహిళ చనిపోతుంటే ఎందుకు ఏ పార్టీ మాట్లాడటం లేదని ప్రశ్నించారు. మహిళల సమస్యలను మగవాళ్లు పట్టించుకోవటం లేదన్నారు. ఇవ్వాళే న్యూస్ పేపర్లో రెండు సంఘటనలు చూసి ఆవేదనకు గురయ్యానని ఆమె చెప్పారు. ఇంటర్ చదువుతున్న అబ్బాయి..తనకు నో చెప్పిందని అమ్మాయిని చెప్పుతో కొట్టాడని న్యూస్ లో చదివానని చెప్పారు. తనకు నో చెబితే చెప్పుతో కొట్టే అధికారం, అహంకారం వాడికి ఎక్కడ నుంచి వచ్చిందని ప్రశ్నించారు. మరో సంఘటనలో డిగ్రీ చదువుతున్న అమ్మాయి హాస్టల్ బాత్ రూమ్ లో ప్రసవించిందని చదివన్నారు. అమ్మాయికి ప్రెగ్నెన్సీ ఉన్న సంగతి హాస్టల్ సిబ్బందికి, ఆమె చదువుతున్న కాలేజ్ అధ్యాపకులకు తెలియకపోవటమేమిటనీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అంటే మహిళల భద్రత విషయంలో ఈ ప్రభుత్వానికి ఎంత నిర్లక్ష్యం ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. అందుకే మనల్ని మనం రక్షించుకునేందుకు, మన హక్కులను సాధించుకునేందుకు ధైర్యంగా ముందుకు సాగాలన్నారు.

పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు ఆర్థికంగా, హార్థికంగా అండగా ఉంటా

మహిళలు పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు జెండా ఎగరేసేందుకు తాను హార్థికంగా, ఆర్థికంగా సాయంగా ఉంటానని కవిత భరోసా ఇచ్చారు. మహిళలకు అవకాశాలు ఇచ్చేందుకే తాను పార్టీ పెట్టానని చెప్పారు. ఇన్ని రోజులు కథ వేరు ఇప్పుడు కథ వేరన్నారు. చీరలు కట్టుకున్న మహిళలు కచేరీకి వెళ్లాల్సి ఉందని, గాజులు వేసుకున్న మహిళలు చట్ట సభల్లోకి వెళ్లాల్సిన అవసరముందన్నారు. మహిళలకు పెన్షన్లు, బంగారం, సైకిళ్లు ఇస్తామని అబద్దాలు చెప్పటం కాదు వారికి ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలన్నారు. మహిళలకు బ్యాంక్ ఖాతాలు, ఉద్యోగాలు, రాజకీయాల్లో అవకాశాలు ఇవ్వాల్సి ఉందని చెప్పారు. మహిళలు ఎవరికీ భయపడకుండా తమ మనస్సాక్షికి సమాధానం చెప్పుకుంటూ రాజకీయాల్లోకి రావాలని కోరారు.

మహిళ విభాగం పేరు తెలంగాణ రుద్రమ సేన

రాజ్యాంగ ఆమోదించుకున్న రోజును పురస్కరించుకొని తెలంగాణ రక్షణ సేన మహిళ విభాగం పేరును తెలంగాణ రుద్రమ సేనగా నామకరణం చేస్తున్నామని కవిత ప్రకటించారు. తెలంగాణ రుద్రమ సేన పోస్టర్ ను మహిళా నాయకులతో కలిసి ఆవిష్కరించారు. రుద్రమ దేవి మాదిరిగా అవసరమైతే కత్తి పట్టి పోరాటం చేయాలని మహిళ నేతలకు ఈ సందర్భంగా సూచించారు. ప్రతి మహిళ కూడా గల్లిగల్లీ తిరుగుతూ ఇంటింటికి రాజ్యాంగం గురించి అవగాహన కల్పించాలన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ మహిళ ఇన్ ఛార్జీలు ప్రజల్లో తిరుగుతూ వారి సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు.

గాంధీ, అంబేద్కర్, జ్యోతిబా, సాయిత్రి భాయ్ లకు నివాళులు

అంతకుముందు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ, మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి భాయి పూలే విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించి ఈ సదస్సును కవిత ప్రారంభించారు. సదస్సులో టీఆర్ఎస్ మహిళ నేతలు మనోజ గౌడ్, వేముల భవాని, సూరారపు కృష్ణవేణి, కావేటి సబిత, సంద్ర మాలతి, పగిడాల శ్రావణి, రజియా బేగం, హలిమా బేగం, తిరుపతి పరమేశ్వరీ, లలితా యాదవ్, సౌజన్య రెడ్డి, గీత, అంశం శివరాణి, ఝాన్సీ, అనితా చౌదరి తదితరులు ప్రసంగించారు.

అన్నారంలో ఐకేజేబీపీ కార్యక్రమం పరిశీలన

హస్నాపూర్‌లో భూముల ఆ సర్వే తనిఖీ

ప్రజలకు ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అందేలా చర్యలు తీసుకోవాలి : అధికారులు

ఇది కద నిజం ,ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నవంబర్ 26: కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని



అన్నారం గ్రామంలో నిర్వహించిన ఐకేజేబీపీ కార్యక్రమాన్ని తహసీల్దార్ మహేందర్, గ్రామ సర్పంచ్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమం అమలు తీరు, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించి, సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదేవిధంగా హస్నాపూర్ గ్రామంలో చేపట్టిన భూముల రీ సర్వే పనులను కూడా తహసీల్దార్ మహేందర్ పరిశీలించారు. సర్వే పనుల పురోగతిని సమీక్షిస్తూ, భూ వివరాల నమోదు పారదర్శకంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

రాజ్యాంగ విలువలను ప్రతి విద్యార్థి అలవర్చుకోవాలి!

పెద్ద రాంపూర్ పాఠశాలలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం విద్యార్థులతో పీఠిక ప్రతిజ్ఞ

ఇది కద నిజం ,ఉమ్మడి నిజామాబాద్ జిల్లా,పెద్ద రాంపూర్: భారత రాజ్యాంగ దినోత్సవం నవంబర్ 26 సందర్భంగా కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోని పెద్ద రాంపూర్ జిల్లా పరిషత్



ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో భారత రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞ చేయించారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన ప్రాథమిక హక్కులు, విధులు, ఆదేశిక సూత్రాల గురించి విద్యార్థులకు వివరించి, రాజ్యాంగ స్ఫూర్తితో నడుచుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, రాజ్యాంగాన్ని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి శ్రీలత, ఉపాధ్యాయులు విట్టల్, స్వరూప, రాజు, శోభ, సీఆర్‌పీ గోపాల్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో "స్వచ్ఛ జలధార" కార్యక్రమం

యాదగిరిగుట్ట మండలంలో తాగునీటి ట్యాంకుల పరిశుభ్రత కార్యక్రమం

పోస్టర్ ఆవిష్కరణ, టీ-షర్టుల ప్రారంభం

ఇది కద నిజం, యాదగిరిగుట్ట: ప్రజలకు స్వచ్ఛమైన, పరిశుభ్రమైన తాగునీటిని అందించడంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన "స్వచ్ఛ జలధార" కార్యక్రమాన్ని ఆలేరు నియోజకవర్గంలో విస్తృతంగా నిర్వహించనున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ,బీర్ల ఫౌండేషన్ చైర్మన్ బీర్ల అనిత సహకారంతో ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని గ్రామపంచాయతీల పరిధిలో విడతల వారీగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 30-11-2026న యాదగిరిగుట్ట మండలంలో తాగునీటి నిల్వ ట్యాంకుల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జర్మన్ సాంకేతికతతో కూడిన ప్రత్యేక యంత్రాల సహాయంతో తాగునీటి ట్యాంకుల్లో పేరుకుపోయిన మట్టి, మురికి, ఇతర వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో తొలగించి ట్యాంకులను పరిశుభ్రపరచనున్నారు. తద్వారా ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించడంతో పాటు నీటి ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించేందుకు కృషి చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ జలధార పోస్టర్‌ను ఆవిష్కరించి, కార్యక్రమానికి సంబంధించిన ప్రత్యేక టీ-షర్టులను ప్రారంభించారు. ప్రజల ఆరోగ్యమే ప్రధాన ధ్యేయంగా బీర్ల ఫౌండేషన్ చేపడుతున్న ఈ కార్యక్రమం ఆలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో దశలవారీగా కొనసాగనుంది. ప్రతి గ్రామంలో తాగునీటి ట్యాంకుల పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు ఫౌండేషన్ కృషి చేయనుంది. "స్వచ్ఛమైన నీరు ఆరోగ్యకరమైన సమాజం" అనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం ప్రజారోగ్య పరిరక్షణలో కీలకంగా నిలవనుంది.



పీఎస్ఓ శ్రీనివాస్ ను పరామర్శించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కార్యాలయ సిబ్బంది

ఇది కద నిజం :యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో రాచమల్ల భద్రయ్య అనారోగ్యంతో మృతిచెందిగ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కార్యాలయ సిబ్బంది, మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బీర్ల



ఐలయ్య పీఎస్ఓ శ్రీనివాస్‌ను కలిసి పరామర్శించారు. భద్రయ్య మృతి పట్ల విచారం వ్యక్తం చేస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.

మున్సిపల్ పనుల్లో వేగం పెంచండి: అదనపు కలెక్టర్ భాస్కర్ రావు

నెల రోజుల్లోగా అమృత్ పథకం పనులు పూర్తి చేయాలి

ఎల్ నినో దృష్ట్యా ముందస్తు త్రాగునీటి ఏర్పాట్లు చేసుకోవాలి

ఆస్తి పన్ను వసూళ్లు 70 శాతానికి చేరుకోవాలని కమిషనర్లకు ఆదేశం



ఇది కద నిజం ,భువనగిరి, నవంబర్ 26: జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం, త్రాగునీటి సరఫరా మరియు పన్నుల వసూళ్లపై అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎ. భాస్కర్ రావు గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ కమిషనర్లకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎల్ నినో ప్రభావం వల్ల రాబోయే రోజుల్లో త్రాగునీటి కొరత తలెత్తే అవకాశం ఉన్నందున, ఇప్పటి నుండే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లాలో కొనసాగుతున్న అన్ని అమృత్ పథకం పనులను నెల రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. రోజువారీ పారిశుద్ధ్య కార్యక్రమాలను తప్పనిసరిగా చేపట్టాలని, ఉదయం పూట కమిషనర్లు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లలో మిగిలి ఉన్న బ్యాలెన్స్ ఇండ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని, రెండవ విడత దరఖాస్తులను విచారించి అర్హులకు ప్రొసీడింగ్స్ జారీ చేయాలని ఆదేశించారు. ఆస్తి పన్ను వసూళ్లను ఇకపై ప్రతి వారం సమీక్షిస్తామని, తదుపరి సమావేశం నాటికి వసూళ్ల శాతం 60 నుండి 70 శాతానికి చేరుకోవాలని లక్ష్యం నిర్దేశించారు. ట్రేడ్ లైసెన్స్ వసూళ్లను కూడా వేగవంతం చేయాలన్నారు. అధికారులంతా నిబంధనల ప్రకారమే పనిచేయాలని, విధుల్లో ఏవైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని పురపాలక సంఘాల కమిషనర్లు పాల్గొన్నారు.



పద్మశాలి సంఘం అధ్యక్షుడు రమేష్ కు అష్టల్ సన్మానం

మరిపెడ, 26 నవంబర్ (ఇది కద నిజం): మరిపెడ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గా ఏకగ్రీవంగా ఎన్నికయిన కోమటి రమేష్ ను గురువారం జిల్లా మైనార్టీ సెల్ నాయకులు షేక్ అష్టల్ శాలువ తో సన్మానించారు. సంఘం అభ్యున్నతికి కృషి చేయాలని కోరుతూ అష్టల్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు.



Registered No : APTEL/25/A0818
ఇది కద నిజం
శుక్రవారం 27-11-2026

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించిన బీర్ల అయిలయ్య



ఇది కద నిజం ,యాదగిరిగుట్ట: యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండల పరిధిలోని యాదగిరిగుట్ట పట్టణం యాదగిరిపల్లి, సైదాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్హులైన కుటుంబాలకు పథకం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో ఏ ఒక్క కుటుంబం కూడా ఆర్థిక ఇబ్బందులతో ఇబ్బందులు పడకూడదనేది ప్రజా ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తికి అనుకోని ప్రమాదం జరిగినా, మరణించినా ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అండగా నిలవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. నవంబర్ 19 నుంచి ప్రారంభించిన ఈ పథకం ద్వారా 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన కుటుంబంలోని సంపాదించే వ్యక్తికి జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు మరణించిన సందర్భంలో వారి నామినీలకు ప్రభుత్వం రూ.5 లక్షల బీమా పరిహారం అందించేలా చర్యలు తీసుకుంటుందని వివరించారు.ప్రమాదవశాత్తు మరణించిన కుటుంబాలకు కూడా నిబంధనల ప్రకారం ఈ పథకం ద్వారా ఆర్థిక భరోసా కల్పించనున్నట్లు తెలిపారు. ప్రైవేటు బీమా సంస్థల ద్వారా అర్హులైన వారికి బీమా సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పథకానికి సంబంధించి ఆధార్ కార్డు, స్మార్ట్ రేషన్ కార్డు, మొబైల్ నంబర్ తదితర అవసరమైన వివరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికి ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ సంకల్పమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తెలిపారు.

మహిళలు, చిన్నారుల భద్రతపై పోలీసుల అవగాహన సదస్సు

అప్రమత్తత, స్వీయ రక్షణతోనే వేధింపులకు అడ్డుకట్ట

మంచి, చెడు స్పర్శపై చిన్నారులకు అవగాహన కల్పించాలి

యాదగిరిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కార్యక్రమం



ఇది కద నిజం ,యాదగిరిగుట్ట, నవంబర్ 26: మహిళలు మరియు చిన్నారుల భద్రత ఎంతో ముఖ్యమైనదని, ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని యాదగిరిగుట్ట పోలీసులు సూచించారు. గురువారం యాదగిరిపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహిళలు, చిన్నారుల భద్రతపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ ఒంటరిగా ప్రయాణించే సమయంలో ప్రయాణ వివరాలను కుటుంబ సభ్యులు లేదా నమ్మకమైన వ్యక్తులతో తప్పనిసరిగా పంచుకోవాలని, రాత్రి వేళల్లో నిర్మానుష్య ప్రాంతాల వైపు వెళ్లవద్దని హితవు పలికారు. ప్రతి మహిళ స్వీయ రక్షణ పద్ధతులను నేర్చుకోవాలని, అత్యవసర ఫోన్ నంబర్లను ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. వేధింపులు, హింస లేదా అనుమానాస్పద సంఘటనలు ఎదురైతే భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని, వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని హెచ్చరించారు. చిన్నారుల భద్రత విషయంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పోలీసులు సూచించారు. చిన్నప్పటి నుండే పిల్లలకు మంచి స్పర్శ (గుడ్ టచ్), చెడు స్పర్శ (బ్యాడ్ టచ్) గురించి అవగాహన కల్పించాలని, ఏదైనా అసౌకర్యం లేదా భయం కలిగితే వెంటనే తల్లిదండ్రులు లేదా పెద్దలకు చెప్పేలా ప్రోత్సహించాలన్నారు. అపరిచితులతో వెళ్లకూడదని, వారి నుండి ఎలాంటి బహుమతులు లేదా ఆహార పదార్థాలు తీసుకోకూడదని నేర్పించాలని తెలిపారు. పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సైబర్ భద్రతపై అవగాహన కల్పించాలని, అత్యవసర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాలో వారికి స్పష్టంగా తెలియజేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, యాదగిరిగుట్ట ఎస్సై యాదయ్య, పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రగతిశీల శక్తులు ఏకం కావాలి

నల్లు సుధాకర్ రెడ్డి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు



డోర్నకల్, 26 నవంబర్ (ఇది కద నిజం): భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రగతిశీల ప్రజాస్వామిక శక్తులు ఏకం కావాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు

కురవి మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర సిపిఐ ఆధ్వర్యంలో రాజ్యాంగం ఆమోదించిన రోజైన రాజ్యాంగ పరిరక్షణ దినంగా పాటిస్తూ రాజ్యాంగ పీఠికను చదివి సామూహిక ప్రతిజ్ఞ చేసిన సందర్భంగా సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గత పన్నెండున్నర సంవత్సరాలుగా కేంద్రంలో పరిపాలన చేస్తున్న బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ మూల సూత్రాలకు విఘాతం కలిగిస్తూ పాసిస్టు ధోరణితో పాలన కొనసాగిస్తూ ప్రతిపక్షాలను నిర్వీర్యం చేస్తూ రాజ్యాంగ సంస్థలైన సిబిఐ,ఈ డి,గవర్నర్ వ్యవస్థ లను వాడుకుంటూ, ఎన్నికల కమిషన్ జీవ సంస్థగా మార్చుకొని సర్ పేరిట లక్షలాది ఓట్లను ఏకపక్షంగా తొలగించి ఆయా రాష్ట్రాల్లో అధికారాన్ని కైవసం చేసుకోవడమే కాకుండా, రాబోయే రోజులలో జమిలి ఎన్నికల పేరట ఏక పార్టీ వ్యవస్థను తీసుకువచ్చి అధికారాన్ని శాశ్వతంగా అనుభవించాలని,ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసే కుట్రలను చేస్తూ, స్వేచ్ఛ, సమానత్వశీ, పౌర హక్కులను కాలరాస్తూ,ప్రజాస్వామ్య హక్కులను తుద ముట్టించే ప్రయత్నాలను దీటుగా ఎదుర్కోని, భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడం, దేశాన్ని రక్షించుకోవడం అత్యంత ఆవశ్యకమని అన్నారు

ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కన్వీనర్ బుడమ వెంకన్న, సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, గ్రామ కార్యదర్శి తురక రమేష్, దూదికట్ల సారయ్య, బొల్లం ఉప్పలయ్య, కలగూర నాగరాజు, టి రమేష్అ,నిల్ ఉదయ్ బొల్లు వెంకన్న, గజ్జి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది: బొబ్బ సోమిరెడ్డి

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సంవిధాన్ రక్షా మార్చ్, అచ్చంపేట బహిరంగ సభకు మండల కాంగ్రెస్ శ్రేణుల తరలింపు



నర్సింహులపేట, 26 నవంబర్ (ఇది కద నిజం): రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కాపాడటమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని నర్సింహులపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొబ్బ సోమిరెడ్డి అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు గురువారం నవంబర్ 26న హైదరాబాద్‌లో నిర్వహించే సంవిధాన్ రక్షా మార్చ్, అచ్చంపేట నియోజకవర్గంలోని హాజీపూర్‌లో నిర్వహించే కాంగ్రెస్ పార్టీ భారీ బహిరంగ సభకు నర్సింహులపేట మండలంలోని వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా బొబ్బ సోమిరెడ్డి మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కల్పించిందని, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, ప్రజాస్వామ్య వ్యవస్థలను బలోపేతం చేయడమే తమ పార్టీ ధ్యేయమని పేర్కొన్నారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు నిర్వహించే సంవిధాన్ రక్షా మార్చ్‌లో, అలాగే అచ్చంపేటలో జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొని రాజ్యాంగ పరిరక్షణకు తమ సంఘీభావాన్ని తెలియజేయనున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొబ్బ సోమిరెడ్డి, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జినుకల రమేష్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు ఎం.డి. మహబూబ్ ఖాన్, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ చిర్ర సతీష్ గౌడ్, సీనియర్ నాయకులు రామకృష్ణ, నర్సింహులపేట సర్పంచ్ పెదమాముల యాకయ్య, లోక్య తండా సర్పంచ్ రాజేందర్ నాయక్, కొమ్ములవంచ సర్పంచ్ పుప్పాల రవీందర్, బొజ్జన్నపేట సర్పంచ్ విజయ రాణి శ్రీనివాస్ రావు, పెద్ద నాగారం సర్పంచ్ మందుల రఘు, జయపురం సర్పంచ్ నెలికుర్తి రేణుక అశోక్ రెడ్డి, పడమటి గూడెం గ్రామ పార్టీ అధ్యక్షులు జక్కుల ఉప్పలయ్య యాదవ్, కౌసల్య దేవి గ్రామ పార్టీ అధ్యక్షులు, సర్పంచ్ అభ్యర్థి గడ్డి వెంకటరెడ్డి, నర్సింహులపేట గ్రామ ఉప సర్పంచ్ కసా యాకయ్య, జెగ్గు తండా సర్పంచ్ సత్తెమ్మ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మోడీ రైతు కార్మిక విధానాలను నిరసిస్తూ తొర్రూరు లో రాస్తారోకో..

మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన రాతపూర్వక హామీలను వెంటనే నెరవేర్చాలి.

ఎస్ కే యం నాయకుల డిమాండ్...



తొర్రూరు, 26 నవంబర్ (ఇది కద నిజం): కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను నిర్మిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్ కే యం) పిలుపులో భాగంగా గురువారం రోజు తొర్రూరు మండలం గాంధీ విగ్రహం ఎదురుగా భారీ రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక, రైతు సంఘాల నాయకులు కొత్తపల్లి రవి, బొల్లం అశోక్ , బంధు మహేందర్ ఊడుగుల లింగయ్య లు మాట్లాడుతూ, దేశానికి అన్నం పెడుతున్న వ్యవసాయ కూలీలకు పెద్ద ఎత్తున నష్టం తెచ్చే విధానాలను తీసుకొస్తున్నాడని దానివల్ల కూలీల బ్రతుకులు దుర్భరంగా మారుతాయి అని వారు అన్నారు. ఇప్పటికే అనేక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఆ వర్గాలు ప్రభుత్వ చర్యల మూలంగా పెనం నుంచి పోయిలో పడ్డ చందంగా వారి పరిస్థితి మారిందని వారు అన్నారు. రాతపూర్వకంగా మోడీ ప్రభుత్వం రైతు సంఘాలకు ఇచ్చిన హామీల లో భాగంగా రైతు పంటకు గిట్టుబాటు ధర చట్టం తీసుకు రాలేదని రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయలేదని వ్యవసాయ మార్కెట్ల చట్ట సవరణ ముసాయిదాను ఉపసంహరించుకోలేదని చట్ట సవరణ అమలు చేస్తున్నారని ఆరోపించారు. మోడీ అనుసరిస్తున్న విధానాల మూలంగా వ్యవసాయ పారిపో పారిశ్రామిక రంగాలు పూర్తిగా దెబ్బతిని దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం అవుతుందని జోష్యం చెప్పారు. దేశం పరాధీనత వైపు పయనిస్తుందని ప్రధాని అంబానీ లాంటి కార్పోరేట్ కంపెనీలకు పెట్టడానికి దేశ ప్రజల శ్రమతో పాటు సహజ వనరులను కొల్లగొడుతున్నారని అన్నారు. ఓట్ చోరీకి పాల్పడుతూ అక్రమ పద్ధతులలో గెలుపొందుతూ భారత రాజ్యాంగాన్ని అది ఇచ్చిన హక్కులను కాలరాస్తున్నారాని వారు విమర్శించారు.రాష్ట్రంలో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని రాష్ట్రాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ రాస్తారోకో సందర్భంగా రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు కలుగచేసుకుని ఆందోళనకారులను శాంతింప చేశారు..... ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజంపల్లి వీరన్న, అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యండి యాకుబ్, జిల్లా సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మణ్ , జిల్లా ఉపాధ్యక్షులు చిర్ర యాకయ్య, రైతు సంఘం నాయకులు కొత్త వెంకట్ రెడ్డి, సోమిరెడ్డి, జమ్ముల శ్రీనివాస్, కిరణ్ ,వెంకన్న, సోమనర్సయ్య, వెంకటకృష్ణ, యాకయ్య, తాళ్ల వెంకటేశ్వర్లు, ఎడ్ల ధర్మయ్య, ఎల్లయ్య, వరలక్ష్మి, షమీనా, రాధా, సౌజన్య, శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా 77వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



స్టేషన్ ఘనపూర్, 26 నవంబర్ (ఇది కద నిజం): స్టేషన్ ఘనపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 77వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ పి.శారద ఆధ్వర్యంలో,జాతీయ సేవా పథకం అధికారులు జి.కమలాకర్,సిహెచ్.లావణ్య సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ పి.శారద మాట్లాడుతూ అధ్యాపకులకు,విద్యార్థులకు జాతీయ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన హక్కులు,విధులు,బాధ్యతలను తెలుసుకోవడంతో పాటు రాజ్యాంగం నిర్దేశించిన విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు.రాజ్యాంగ స్ఫూర్తితో నడుచుకుంటూ సమానత్వం,న్యాయం,సౌభ్రాతృత్వ భావాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,జాతీయ సేవా పథకం అధికారులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



తొర్రూరు, 26 నవంబర్ (ఇది కద నిజం): రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 77వ భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం (సంవిధాన్ దివస్) ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా కళాశాల ఇన్-ఛార్జి ప్రిన్సిపాల్ పార్వతి భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, భారత రాజ్యాంగ రూపకల్పనలో రాజ్యాంగ పరిషత్తు, పోషించిన చారిత్రక పాత్రను వివరించారు. దేశంలో ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, సమానత్వం, ప్రాథమిక హక్కులు మరియు విధులపై ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలని, రాజ్యాంగ స్ఫూర్తితో విద్యార్థులు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వాల్య నాయక్, అధ్యాపకులు సునీల్, వెంకన్న, విజయ్, రజిత, రాధిక, అంజుఅరా, నగేష్ బాబు మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

జయపురం గ్రామపంచాయతీ లో ఘనంగా 77వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



నర్సింహులపేట, 26 నవంబర్ (ఇది కద నిజం): పంచాయతీ సెక్రెటరీ ఊడుగుల సుధాకర్ ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల ఘన నివాళులు ఈ కార్యక్రమంలో పాల్గొన్న కారోబార్ శేఖర్ కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మందుల యాకూబ్ మందుల పరశురాములు గండి నారయ్య రమేష్ బాబు గ్రామ ప్రజలు.

రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలి ఏవో వినయ్ కుమార్



నర్సింహులపేట, 26 నవంబర్ (ఇది కద నిజం): ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని, రైతులు ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల వ్యవసాయ అధికారి జి. వినయ్ కుమార్ సూచించారు. మండలంలోని బొజ్జన్నపేట మరియు కౌసల్య దేవి పల్లి గ్రామపంచాయతీలలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ, వరి సాగుకు ప్రత్యామ్నాయంగా బొబ్బర్లు, పెసర, మినుము, జొన్న వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని కోరారు. బొజ్జన్నపేట సర్పంచ్ పల్లెల విజయ రాణి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆరుతడి పంటల సాగు ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించడంతో పాటు సాగు ఖర్చులను కూడా నియంత్రించుకోవచ్చని తెలిపారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను రైతులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఇరిగేషన్ ఏఈ వంశీ సూచించారు.

తదనంతరం రైతు మూల శ్రీనివాస్ రెడ్డి డ్రిప్ ఇరిగేషన్ (బిందు సేద్యం) ద్వారా సాగు చేస్తున్న బొబ్బరి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె. కళ్యాణి, పశు వైద్య అధికారి మంజీలాల్, రైతులు లింగారెడ్డి, వెంకన్న మరియు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.